క్లుప్తంగా

విదేశీ విద్యపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల మూడు, నాలుగవ సంవత్సరం విద్యార్థులకు సోమవారం అబ్రాడ్ హెచ్‌క్యూ ఆధ్వర్యంలో విదేశాల్లో చదివే విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి శ్రీధర్ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు కావాల్సిన అర్హతలు, మార్గాలు, సూచనలు తెలియజేశారు. ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, వైస్ ప్రిన్సిపల్ నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పడగల్‌వాసికి డాక్టరేట్



వేల్పూర్: పడగల్ గ్రామానికి చెందిన తలారి గోపిరాజు ఇటీవల హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు సోమవారం తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో గుండెకు సంబంధించిన మందులపై గత ఏడాది పరిశోధన పత్రం సమర్పించారు. దాంతో ఆయనకు డాక్టరేట్ లభించింది.

హెల్మెట్లు, దోమతెరల పంపిణీ



రెంజల్(బోధన్): బోర్గాంలో సోమవారం యువకులకు హెల్మెట్‌లు, పాఠశాలలో విద్యార్థులకు దోమతెరలను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. నియోజకవర్గ నాయకుడు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కరుణాకర్‌రెడ్డి, నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో హెల్మెట్లు, దోమతెరలను అందించారని గుర్తుచేశారు. ఎడపల్లి మాజీ ఎంపీపీ భాస్కర్‌రాజ్, లొల్లి పర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పిల్లలకు సైకిళ్లు..



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గంజ్, ఆచన్‌పల్లి ప్రాంతాల్లోని నిరుపేదల పిల్లలకు అయేషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్లను ఎమ్మెల్యే సతీమణి అయేషా పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా ఫజర్ నమాజ్ 40 రోజులు చేసిన 81 మంది పిల్లలకు సైకిళ్లను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..



కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌కు చెందిన ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. గంగామణికి రూ.60 వేలు, సీహెచ్ భాజన్నకు రూ.40 వేలు, రాధకు రూ.60 వేలు మంజూరు అయ్యాయి. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, ఎంపీటీసీ అనిల్, నాయకులు చిన్నారెడ్డి, మురళి పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించుతాం



మాక్లూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడుతామని చెప్పి మోసం చేసిన బీజేపీని రానున్న ఎన్నికల్లో గద్దె దించుతామని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా సోమవారం అమ్రాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో మాదిగలకు హామీ ఇచ్చి గెలుపొందిన బీజేపీ తీరా మోసం చేసిందన్నారు. మాదిగలందరు ఐక్యంగా ఉండి మోసం చేసిన బీజేపీకి రానున్న ఎన్నికల్లో ఓట్లతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. నేతలు ఒడ్డెన్న, సరికెల పోశెట్టి, నాగభూషణం, పి భూమన్న, గంగాధర్ పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి

- బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన దీక్షలు



బాల్కొండలో మాట్లాడుతున్న బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌కు తెలియకుండా పేపర్ లీకేజీ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం బాధ్యత వహించి రూ.లక్ష నష్ట పరిహారం అందించాలన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో దోషులను తేల్చే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, నాయకులు డాక్టర్ శివప్ప, అడ్లూరి శ్రీనివాస్, రామరాజు, ఎడపల్లి మండల అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

బాల్కొండ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులకు లీకేజీ నీళ్లు ఇవ్వమంటే ఇవ్వని ప్రభుత్వం, విద్యార్థులకు పరీక్ష పేపర్లను మాత్రం లీకేజీ చేస్తోందని ఎద్దేవా చేశారు. పరీక్ష పేపర్ లీకేజీపై ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రా రెడ్డి స్పందించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబటి నవీన్, మల్కన్నగారి మోహన్ పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

ఆర్మూర్‌టౌన్: పరీక్ష పేపర్ల లీకేజీకు కారణమైన కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆర్మూర్ తహసీల్ ఎదుట ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలపు రాజు అధ్యక్షతన 'మా నౌకరీలు మాగ్గావాలే' అని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే దాకా ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. రానున్న కాలంలో యువత కేసీఆర్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు.



ఆర్మూర్‌లో నిరసన చేపడుతున్న బీజేపీ నేతలు



బోధన్ పట్టణంలో నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



కొండూరులో కంటి వెలుగు సిబ్బందితో జెడ్పీ చైర్మన్



నాగాపూర్‌లో.. సర్పంచ్, ఎంపీడీవో

నందిపేట్ (ఆర్మూర్): చౌడమ్మ కొండూరులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో నాగవర్ధన్, సర్పంచ్ ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు

నాగాపూర్‌లో..

బాల్కొండ: నాగాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పెంటు లింభన్న ప్రారంభించారు. ఎంపీటీసీ నారాయణ, ఎంపీడీవో సంతోష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయకూర్ క్యాంపులో..



రాయకూర్ క్యాంపులో.. సర్పంచ్ నిర్మల

రుద్రూర్: రాయకూర్ క్యాంపులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ ముప్పనేని నిర్మల ప్రారంభించారు. గ్రామంలో మూడు రోజుల పాటు శిబిరం ఉంటుందని ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ రిహానా బేగం, విండో చైర్మన్ సంగమేశ్వరావ్, కో–ఆప్షన్ మండల సభ్యుడు మస్తాన్, వైద్యురాలు శ్రీలత పాల్గొన్నారు.

మంచినీటి సౌకర్యం కల్పించండి



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 1300 ప్లాట్లలో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ కోరారు. 30 ఏళ్లుగా ప్రజలు నివాసముంటున్నా ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బోరు చెడిపోయి 15 రోజులు కావుస్తున్న మరమ్మతులకు నోచుకోవడం లేదని వాపోయారు. కాలనీ మహిళలు రోడ్డుపైకి వచ్చి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు ఐదు నిమిషాలు మాత్రమే వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, రాజు, భాగ్య, స్వప్న, సంధ్య పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



తనిఖీ చేస్తున్న డీఐఈవో రఘురాజ్

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో లోకం రఘురాజ్ సూచించారు. సోమవారం బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో, కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని సూచించారు. కోటగిరిలో సోమవారం పరీక్షకు ఏడుగురు గైర్హాజరైనట్లు పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ రిజ్వానా సమీర్ తెలిపారు. ఆయన వెంట పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ శివకుమార్ యాదవ్ ఉన్నారు.

నువ్వుల పంటలో యాజమాన్య పద్ధతులు



వన్నెల్(బి)లో పంటను పరిశీలిస్తున్న అధికారి

బాల్కొండ: నువ్వు పంటలో యాజమాన్య పద్ధతులను పాటించాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వన్నెల్(బి)లో నువ్వుల పంటను పరిశీలించారు. రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమీడా క్లో ప్రిడ్ 300 ఎంఎల్ ఏదైన ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఆకు ముడత పురుగు, బిహారీ గొంగళి పురుగు నివారణకు క్లోరీఫైరి ఫాస్ 500 ఎంఎల్ లేదా తయోడికార్బ్ 100 గ్రాములును పిచికారీ చేయాలన్నారు. వేరు కుళ్లు లేదా కాండం కుళ్లు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 300 గ్రా. లేదా మెటల్ అక్సెలు 300 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. రైతులు సకాలంలో చర్యలు తీసుకుంటే పంట దిగుబడి తగ్గకుండా ఉంటుందన్నారు. ఏఈవో నిహారిక ఉన్నారు.

అక్రమ మొరం దందాపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నరేష్

బోధన్‌రూరల్(బోధన్): ఊట్‌పల్లిలో ప్రభుత్వ అనుమతుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ మొరం దందాపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువకుడు, సామాజిక కార్యకర్త నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. మొరం క్వారీలో నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి



జమీల్ అహ్మద్‌ను అభినందిస్తున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): అధ్యాపకులకు ఇచ్చే అవార్డులు వారి బాధ్యతను మరింత పెంచుతాయని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వర్సిటీ హిందీ విభాగం, నాగఫణి పత్రిక(డెహ్రాడూన్, ఉత్తరాఖండ్) సంయుక్త ఆధ్వర్యంలో 'హిందీ సాహిత్యమే అస్మిత మూలక్ విమర్శ్ వివిధ్ ఆయామ్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో తెయూ హిందీ అధ్యాపకుడు ఎండీ జమీల్ అహ్మద్ పాల్గొన్నారు. ఆయన 'నాందేవ్ డసాల్ రాష్ట్రీయ దళిత సాహిత్య సమ్మాన్' జాతీయ అవార్డును అందుకున్నారు. సోమవారం తనను కలిసిన జమీల్‌ను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. జమీల్ అహ్మద్ మాట్లాడుతూ... హిందీ భాషలో దళిత సాహిత్య అభివృద్ధికి చేసిన పరిశోధనలకుగాను ఈ అవార్డ్ లభించడం ఆనందంగా ఉందన్నారు.

పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి



మీటింగ్‌లో పాల్గొన్న మున్సిపల్ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): రాబోవు ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పట్టణంలోని ఆలయాల వద్ద, ప్రార్థనా మందిరాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని బల్దియా అధికారులకు ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ సూచించారు. సోమవారం ఎమ్మెల్యే బల్దియా అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏఈ శివకృష్ణ, అధికారులు ఉన్నారు.

బీడీ సెంటర్ తరలింపు నిలిపివేయండి



భీమ్‌గల్: మండలంలోని పురాణీపేట్ బీడీ సెంటర్‌ను డిచ్‌పల్లికి తరలించే ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పురాణీపేట్‌లో బీడీ కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. సెంటర్‌ను పురాణీపేట్ నుంచి డిచ్‌పల్లి సెంటర్‌కు మార్చడం వల్ల కింది స్థాయి కార్మికులపై భారం పడుతుందని తెలిపారు. కార్మికులను, సెంటర్ తరలింపును నిలిపివేయాలని, లేని పక్షంలో సెంటర్ ముందు నిరాహార దీక్షలు చేయడానికి పూనుకుంటామని హెచ్చరించారు. నేతలు దాసరి దత్తాద్రి భూమేష్, కిష్టయ్య, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ సూచనల మేరకు విద్యార్థులకు బజార్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 30 స్వయం సహాయక సంఘాలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే వ్యాపారం, ఇతర రంగాల్లో నైపుణ్యాలు, ఒడిదొడుకుల గురించి తెలుసుకోవడానికి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సమన్వయ కర్త రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరికలు



బాల్కొండ: మండల కేంద్రంలో వైఎస్సార్‌టీపీలో సోమవారం పలువురు చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌతం ప్రసాద్, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నిధులు, నియామకాలు, నీళ్ల అంటూ సాధించిన తెలంగాణను బీఆర్‌ఎస్ పాలనలో అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. పేపర్ లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు.

చట్టాలపై అవగాహన



రెంజల్(బోధన్): రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు చట్టాలపై ఎస్సై సాయన్న అవగాహనం కల్పించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు అందించే ఫిర్యాదుల నుంచి విచారణ, ఎఫ్‌ఐఆర్ నమోదు, విచారణ తీరు, ఫోక్సో యాక్ట్, కోర్టులకు అందించే విచారణ నివేదికల గురించి వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

స్వచ్ఛ భారత్ రెండో దశ శిక్షణ



మోర్తాడ్: మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులకు స్వచ్ఛ భారత్ రెండో దశ కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణను ఏర్గట్ల రైతు వేదికలో సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మధులు జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవోలు రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీటీవీలకు మార్కెట్‌లో మంచి డిమాండ్



సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ శిక్షణను ప్రారంభిస్తున్న డిచ్‌పల్లి సీఐ మోహన్

డిచ్‌పల్లి: ప్రస్తుతం నగరం, పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా సీసీ టీవీ కెమెరాలకు మంచి డిమాండ్ ఉందని డిచ్‌పల్లి సీఐ డి.మోహన్ అన్నారు. డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం సీఐ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ టీవీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. శాంతి భద్రతల అంశంలో, ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో సీసీటీవీ కెమెరా ఫుటేజీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నిరుద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సీఐ సూచించారు. అనంతరం సంస్థ ఆవరణలో సీఐ మోహన్‌తో పాటు ఎస్సై గణేష్ మొక్కలు నాటారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



వేల్పూర్: మోతెలో ఆదివారం దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కనక ప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. దాడికి గురైన దళితులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులకు చెందిన ఒకటిన్నర ఎకరా పట్టా భూమిని దేవుడి పేరిట వీడీసీ ప్రతినిధులు కబ్జా చేసే కుట్ర పన్నారని ఆరోపించారు. వీడీసీ ప్రతినిధులు సమాంతర ప్రభుత్వం నడుపుతూ దళితుల భూమి కబ్జాకు చేస్తున్న కుట్రను అధికారులు, నాయకులు అడ్డుకోకపోవడం శోచనీయమన్నారు. నాయకులు మంద ప్రభాకర్, కండె క్రాంతి, ప్రతాప్, సచిన్ ఉన్నారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మిలు తెలిపారు. మొదటి రోజు అధ్యక్ష పదవికి సరసం చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిరియాల జగన్, ప్రధాన కార్యదర్శిగా అయినారి అశోక్, సంయుక్త కార్యదర్శికి జేడీ మధుసూదన్, గ్రంథాలయ కార్యదర్శికి వడ్నాల రాజేందర్, కోశాధికారులుగా అరుణ్, కొండి పవన్‌లు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

తృణధాన్యాలతో వంటల పోటీలు



రుద్రూర్: అక్బర్‌నగర్‌లోని ఆహార సాంకేతిక విజ్ఞాన కళాశాలలో సోమవారం విద్యార్థులకు వంటపోటీలు ఏర్పాటు చేశారు. తృణధాన్యాలతో వివిధ రకాల వంటలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ పదార్థాల్లో ఉండే విటమిన్‌లు, ఉపయోగాల గురించి వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ స్వామి, అధ్యాపకులు ఉన్నారు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలెక్కడ?



బోధన్‌టౌన్(బోధన్): సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షులు షేక్ ఖలీం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా బీఆర్‌ఎస్ 12 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. ఆదిల్, సమీర్, రేహాన్‌లు ఉన్నారు.

చేపలు అమ్ముకోడానికి స్థలమివ్వాలి



బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని అమ్దాపూర్‌లో చేపలు విక్రయించడానికి తమకు స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన గంగపుత్రులు ఆర్డీవో రాజేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ నేత సుదర్శన్ పాల్గొన్నారు.

డెస్క్ బెంచీల వితరణ

మోర్తాడ్: మోర్తాడ్ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం 45 డెస్క్ బెంచీలను ప్రముఖ పారిశ్రామికవేత్త దయానంద్‌రెడ్డి కొనుగోలు చేసి విరాళంగా అందించారు. సోమవారం కళాశాలకు బెంచీలను సరఫరా చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడేంత బెంచీలు లేవని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి విన్నవించగా ఆయన స్పందించి తన బంధువు ద్వారా బెంచీలను విరాళంగా ఇప్పించారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డికి, దాత దయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.